
మాట్లాడుతున్న సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి


మాట్లాడుతున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

విద్య ప్రజల జీవితాలను మెరుగుపర్చాలి

- ఉన్నత విద్యా వ్యాప్తిలో కేయూ కీలక భూమిక
- సమర్థవంతంగా జాతీయ విద్యావిధానం అమలు
- 50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- జ్ఞానం సద్వినియోగంతోనే సత్ఫలితాలు : సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి

పరిశోధన, అభివృద్ధి అనేది ప్రయోగశాలకే పరిమితం కారాదని, వాస్తవిక జీవనంలో ప్రజల మౌలిక అవసరాలను తీర్చే, వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకురాగలిగే ఆలోచనలకు కేంద్రంగా ఉండాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. కేయూలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ విద్యావిధానం అమలులో కీలక భూమిక పోషిస్తోందని ప్రశంసించారు. కన్నుల పండువలా జరిగిన ఈ వేడుకలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చాన్స్‌లర్ హోదాలో పాల్గొనగా, సీఎస్ఐఆర్-ఐఐసీటి డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్‌లు, బంగారు పతకాలు సాధించిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంతోపాటు పాలక మండలి, అకడమిక్ సెనెట్ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. పట్టాలు స్వీకరించేందుకు అభ్యర్థులు తమ కుటుంబసభ్యులతో తరలిరావడంతో క్యాంపస్‌లో పండుగ వాతావరణం కనిపించింది. డాక్టరేట్‌లు సాధించిన అభ్యర్థులతో వీసీ ప్రతిజ్ఞ చేయించారు.

- ఆంధ్రజ్యోతి, కేయూ క్యాంపస్


నవోదయ పాఠశాలలో ప్రవేశాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నవోదయ పాఠశాలలో ప్రవేశం కోసం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2026-27 విద్యాసంవత్సరంలో నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లానివాసులై ఉండాలని, 2025-26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండి 2014 మే 1 నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3వ తరగతి నుంచి నాలుగో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 13న పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 91107 82213, 79932 63431ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జవహర్ నవోదయ కళాశాల ప్రిన్సిపాల్ పూర్ణిమా, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

20.7 మిల్లీమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు సగటు 20.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. కొత్తగూడలో 31.2, గంగారంలో 19.4, బయ్యారంలో 58.6, గార్లలో 24.8, డోర్నకల్‌లో 39.0, కురవిలో 29.0, మహబూబాబాద్‌లో 17.8, గూడూరులో 21.8, కేసముద్రంలో 34.8, నెల్లికుదురులో 4.8, నర్సింహులపేటలో 17.0, చిన్నగూడూరులో 10.6, మరిపెడలో 8.4, దంతాలపల్లిలో 10.2, తొర్రూరులో 2.4, పెద్దవంగరలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 20.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


కేసముద్రంలో బహిరంగ సభకు ఏర్పాటు చేసిన జర్మన్ హ్యాంగర్ భారీ టెంట్లు

పాలన పరుగులు

మహబూబాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిలు మంగళవారం పర్యటించనున్నారు. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. పాలనను పరుగులు పెట్టించేందుకు మంత్రులు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మురళీనాయక్, అధికారులు పలుమార్లు సభాస్థలి ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పూర్తి చేశారు. మహబూబాబాద్ మండలం సోమ్లతండాలో, కేసముద్రం మునిసిపల్ కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభల ఏర్పాట్లు పూర్తయ్యాయి. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన విజయవంతం కోసం ఎమ్మెల్యే ఆహర్నిశలు శ్రమిస్తున్నారు. వర్షం వచ్చినప్పటికీ సభలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా షామియానాలను ఏర్పాటు చేశారు.

సోమ్లతండాలో శంకుస్థాపనలు ఇలా..

మహబూబాబాద్ మండలం పర్వతగిరి శివారు సోమ్లతండాలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి అక్కడ జరిగే సభలో డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు ప్రసంగించనున్నారు. బేతోలు భజనతండా నుంచి మల్యాల మీదుగా సోమ్లతండా వరకు రూ.20 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్, జమాండ్లపల్లి చెక్ పోస్టు నుంచి నడివాడ మీదుగా రెడ్యాల ఎన్‌హెచ్ వరకు రూ.20 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు, కురవి రోడ్‌లోని ఎన్‌హెచ్ పెట్రోల్ పంప్ నుంచి రజలిపేట వరకు రూ.3 కోట్లతో నిర్మించే, బోరింగ్ తండా నుంచి ముడుపుగల్ వరకు రూ.2 కోట్లతో నిర్మించే రోడ్లకు సోమ్లతండా వద్ద శంకుస్థాపనలు చేయనున్నారు. పర్వతగిరి, వేంనూరులలో నిర్మించతలపెట్టిన విద్యుత్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.3.60 కోట్లతో ఏర్పాటు చేసే సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు

(మిగతా 8వ పేజీలో...)

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

- రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సోమ్లతండా, కేసముద్రంలో సభలకు భారీ ఏర్పాట్లు
- దగ్గరుండి పర్యవేక్షించిన ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన ఇలా..

జిల్లాలో ఈ నెల 8న సోమ్లతండా, కేసముద్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పర్యటించనున్నారు. హైదరాబాద్ బేగంపేట నుంచి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉదయం 10.45 గంటకు ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా బయలుదేరుతారు. 11.30 గంటలకు మహబూబాబాద్ మండలం సోమ్లతండాకు చేరుకుంటారు. ఆయనతో పాటు మంత్రులు కూడ అక్కడికి రానున్నారు. ఆపై వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తారు. ఆపై స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేసిన అనంతరం సభలో ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు సోమ్లతండా నుంచి రోడ్డు మార్గాన కేసముద్రానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, స్వయం సహాయక గ్రూపు సభ్యులకు బ్యాంకు రుణాల చెక్కులను అందించిన అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

సాయంత్రం 4 గంటలకు హెలీకాప్టర్‌లో అక్కడ్నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. నియోజకవర్గంలో జరిగే మంత్రుల పర్యటనలో మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డోర్నకల్ శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాంనాయక్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.


సభ ఏర్పాట్లనుపరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో రవిరాథోడ్


మరిపెడలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

మరిపెడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : స్థాయికి మించి ప్రథమ చికిత్స కేంద్రాలలో వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్ ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వాహకులను హెచ్చరించారు. మరిపెడలోని రవిబాబు ప్రథమ చికిత్స కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. రవిబాబు ఎలాంటి అనుమతులు లేకుండా రోగులకు పవర్‌ఫుల్ స్టెరాయిడ్స్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. యాంటీబయోటిక్, సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తూ పట్టుపడ్డట్లు తెలిపారు. స్థాయికి మించి వైద్యం చేస్తున్నందున అతడిపై డీఎంహెచ్‌వో రవిరాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందాలని ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం సవాలే!

- కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి అడ్లూరి
- గ్రామస్థాయి నుంచి పార్టీ జిల్లా కమిటీల ఎన్నికల బాధ్యతలు
- అంతర్గత విభేదాలను పరిష్కరించడం కత్తిమీద సామే..
- కొనసాగుతున్న ఇన్‌చార్జిల నియామకాల జోరు
- ఇప్పటికే వరంగల్ పార్లమెంట్‌కు చిట్ల సత్యనారాయణ, మహబూబాబాద్‌కు పోట్ల నాగేశ్వర్‌రావు
- తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా మంత్రికి బాధ్యతలు
- పార్టీ పదవులపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు


▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ పార్టీ పదవులు, నామినేటెడ్ నజరానాలు లేక డీలా పడుతున్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు ఈ నెలఖారులోగా గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే టీపీసీసీ నుంచి జిల్లాకో పరిశీలకుడిని నియమించగా, ఇటీవల పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను పార్టీ ఇన్‌చార్జిగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నియమించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్న అధిష్టానం, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తుంది.

ఇన్‌చార్జిల నియామకం

సంస్థాగత ఎన్నికల కోసం అధిష్టానం వివిధ దశల్లో ఇన్‌చార్జీలను బాధ్యులుగా నియమించింది. ఇప్పటికే ఏప్రిల్ 23వ తేదీన ప్రతి జిల్లాకో పీసీసీ పరిశీలకుడిని నియమించింది. వరంగల్ జిల్లాకు ఆమీర్ ఆలీఖాన్, హనుమకొండ జిల్లాకు కోమటిరెడ్డి వినయ్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లాకు పోట్ల నాగేశ్వర్‌రావు, జనగామ జిల్లాకు అద్దంకి దయాకర్, భూపాలపల్లి జిల్లాకు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ములుగు జిల్లాకు కొండేటి మల్లయ్యలను

(మిగతా 8వ పేజీలో...)



పనిగంటల పెంపు జీవోను విరమించుకోవాలి

- కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 నుంచి 10 గంటల పెంచుతూ విడుదల చేసిన జీవో ఉత్తర్వులను తక్షణమే విరమించుకోవాలని, ఈ నెల 9న జరుపతలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మహబూబాబాద్ పట్టణంలో కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వీరభవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా సాగి వ్యవసాయ మార్కెట్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ, టీయూసీఐ సంఘాల నాయకులు కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, శివారపు శ్రీధర్, ఎస్కే. మదార్, కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. జూలై 9న దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న స్థానిక వ్యవసాయ మార్కెట్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ఉంటుందని కార్మికులు, ప్రజలు హాజరు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, గారె కోటేశ్వర్‌రావు, మంద శంకర్, చెక్కల సోమయ్య, మధుసూదన్, జక్కరయ్య, కోటేష్, లింగన్న పాల్గొన్నారు.

- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించి వేస్తుందని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి మరిపెల్లి మొగిలి విమర్శించారు. మహబూబాబాద్ పట్టణ శివారు బాలాజీ కోల్డ్ స్టోరేజీలో కార్మికులకు ఏఐసీటీయూ ఆధ్వర్యంలో సోమవారం దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరుతూకరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాటోతు బిచ్యానాయక్, బోడ చందు, బానోత్ రవి, అజ్మీర రమేష్, రవి, భద్రు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దుర్మార్గం

బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్



సుబేదారి పోలీసు స్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్ విమర్శించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాకతీయ యూనివర్సిటీ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేసి సుబేదారి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలన అందిస్తామంటూ బ్రోకర్ మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వారిని పొద్దుపొడవకముందే పోలీసులు ఇంటికి పంపి అరెస్టులు చేశారని మండిపడ్డారు. గవర్నర్‌కు వినతి పత్రాలు ఇవ్వడానికి అనుమతిస్తామని చెప్పి విద్యార్థి సంఘాలతో వీసీ చర్చలు నిర్వహించిన అనంతరం అర్ధరాత్రి నుంచే వారిని అరెస్టు చేసి సోమవారం సాయంత్రం విడుదల చేశారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్, నాయకులు బొల్లికొండ వీరేందర్, పోలపల్లి రాంమూర్తి, గుగులోతు రాజేష్ నాయక్, గండ్రకోట రాకేష్ యాదవ్, స్నేహిత్ ఉన్నారు.

విద్యార్థి నేతల ముందస్తు అరెస్టులు...



కేయూ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు బైరపాక ప్రశాంత్ తదితరులు

కేయూక్యాంపస్ జూలై 7, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాకతీయ యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూతో పాటు ఇతర విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వర్సిటీ పోలీస్‌స్టేషన్‌తోపాటు హసన్‌పర్తి, సుబేదారి ఇతర పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టైన వారిలో కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నేత బొల్లికొండ వీరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

రేపు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బంద్

వరంగల్ వ్యవసాయం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్మిక సంఘాలు, యూనియన్లు ఈనెల 9న సమ్మెలో పాల్గొంటున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్‌కు సమ్మె నోటీసు ఇచ్చినందున చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, కార్మికులు, వ్యాపారులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు. మార్కెట్‌లో తిరిగి గురువారం నుంచి క్రయ విక్రయాలు యథావిధిగా జరుగుతాయని కార్యదర్శి పేర్కొన్నారు.

టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి
- రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హనుమకొండ కలెక్టరేట్, జూలై7(ఆంధ్రజ్యోతి): క్షయ(టీబీ)వ్యాధిపై ప్రజలకు కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన కల్పించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో టీబీ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల తీరు తెన్నులపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశంలో టీబీ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రధాని టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు స్ర్కీనింగ్ క్యాంపులు నిర్వహించి టీబీ కేసులను గుర్తించాలన్నారు. టీబీ నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఇందులో రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన పేషంట్లకు దాతల ద్వారా పౌష్టిక ఆహార కిట్లను అందించాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపుగా 9లక్షల జనాభా ఉందని, ఇందులో 1.98లక్షల మంది హైరిస్క్ గ్రూపులో ఉన్నారని అన్నారు. వీరందరికీ స్ర్కీనింగ్, ఎక్స్‌రే చేసి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇప్పటివరకు 6923 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయగా ఇందులో 1389మందికి ఎక్స్‌రే పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో 720 క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో జూన్ 2 నుంచి టీబీ స్ర్కీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో 2,04,979 మంది హై రిస్క్‌లో ఉన్నారని, అందులో 5389 మందికి ఇప్పటివరకు పరీక్షలను నిర్వహించామన్నారు. ఇందులో 176 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లాలో 594 మంది క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. హనుమకొండ జిల్లాకు రూ.60వేలు, వరంగల్ జిల్లాకు రూ.40వేలను పోషకాహార కిట్లనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డాక్టర్ రాకేష్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లాకు రూ.50వేలను, డాక్టర్ వంగ హేమంత్‌రెడ్డి రూ.20వేలు గవర్నర్ సమక్షంలో కలెక్టర్‌లకు అందజేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషినల్ కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు, డీఎంహెచ్‌వోలు, ప్రభుత్వ వైద్యాధికారులు పాల్గొన్నారు.

పీడీపీఎస్ విధానాన్ని స్వాగతిస్తున్నాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కటకం పెంటయ్య తదితరులు

- ఈ స్కీంతో పత్తి రైతులకు ఎంతో మేలు..
- కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం పెంటయ్య

వరంగల్ వ్యవసాయం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం(పీడీపీఎస్) విధానాన్ని స్వాగతిస్తున్నామని, దీనివల్ల పత్తి రైతులకు మేలు జరుగుతుందని అడ్తి అండ్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం పెంటయ్య అన్నారు. సోమవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మినీ చాంబర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెంటయ్య మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌కు 10, 20 బస్తాలు తీసుకువస్తే సీసీఐకి అమ్ముకోని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రయోగాత్మకంగా పీడీపీఎస్‌ను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మార్కెట్‌కు 30, 40 శాతం మంది రైతులు బస్తాలలోనే పత్తిని తీసుకువచ్చి అమ్ముతారని, బస్తాలలో తీసుకువచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని అన్నారు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. వాహనాలలో లూజు పత్తి తీసుకురావాలంటే అధిక కిరాయి చెల్లించలేని స్థితిలో ఉన్న రైతులు మార్కెట్‌కు బస్తాలలోనే పత్తిని తీసుకువచ్చి అమ్ముకుంటారని తెలిపారు. పీడీపీఎస్ విధానం వల్ల ప్రతీ పత్తి రైతుకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. పత్తికి బహిరంగ మార్కెట్ ధర, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికిన సందర్భాల్లో అట్టి వ్యత్యాసం ధర మొత్తాన్ని రైతులకు నేరుగా చెల్లించే ఉద్దేశ్యంతో పీడీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులకు, అడ్తిదారులకు, కార్మికులకు.. ఇలా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డి, చాంబర్ సహాయ కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, మొగిలి చంద్రమౌళి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ మార్కెట్లలో పీడీపీఎస్ అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయాన్ని అడ్తి సెక్షన్ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినప్పటికీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మార్కెట్లలో అడ్తి వ్యవస్థ ఉన్న దగ్గర వారికి ఏవిధంగా నష్టం జరుగకుండా నిబంధనలు రూపొందించాలని నీతి ఆయోగ్ సమావేశంలో కోరినట్లు తెలిసిందన్నారు. అదే విధంగా ఇప్పటికే మార్కెట్లలో బస్తాలలో తెచ్చిన పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను రవీందర్‌రెడ్డి కోరిన విషయం తెలిసిందేనన్నారు. కొందరు కావాలని అడ్తిదారులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని, ఏ సమస్య ఉన్నా.. చాంబర్ ఆఫ్ కామర్స్ లేదా అడ్తి సెక్షన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పీడీపీఎస్ విధానాన్ని అడ్తిదారులు స్వాగతిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. పీడీపీఎస్ సిస్టం ఇప్పటికిప్పుడు వచ్చింది కాదన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వం, అధికారులు దీనిపై విశ్లేషించి తీసుకువచ్చిన స్కీం అని ఆయన పేర్కొన్నారు. సీసీఐకి జిన్నింగ్ మిల్లులు, తగినంత సిబ్బంది, గోదాములు లేవన్నారు. సీసీఐ ఇక్కడ ప్రాసెస్ చేయలేదని, రైతులు, అడ్తిదారులకు, గుమస్తాలకు, దడువాయిలకు ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా దీర్ఘంగా ఆలోచించి పీడీపీఎస్‌ను తీసుకువస్తున్నారని తెలిపారు. అడ్తిదారులందరు స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చాంబర్ ప్రతినిధులు, అడ్తిదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 13వరకు గద్వాల జిల్లా ఉత్తనూర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర (అంతర్ జిల్లాల) స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టును సోమవారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డోలి సాంబయ్య తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్ లోని మాన్ఫర్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-18బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి రాజు, పీఈటీలు విజయ్‌కుమార్, సునీలా, కోచ్‌లు ఎండీ. ఇర్ఫాన్, యశ్వంత్, సీనియర్ క్రీడాకారులు సాగర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

- పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే...

బాలుర విభాగంలో: అక్షిత్, శ్రీవైభవ్, మాషూక్, రెహన్, షాహిద్, షహన్, సాత్విక్, భువన్ ఆద్య, మసూద్, అభినవ్, రిషి, హర్ష ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో: మేరి హసిని, యుక్తి, తేజస్వి, వేలిక, మీనాక్షి, శారన్, సహస్ర, భార్గవి, పూర్విక, యోగస్విని సుదీక్ష, సహస్రపటేల్ ఉన్నారు. వీరు అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టుతో నిర్వాహకులు

అన్‌మ్యాన్డ్ వర్కర్స్‌ను ఆర్టిజన్‌లుగా గుర్తించాలి

327 యూనియన్ నాయకులకు వినతి

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమను ఆర్టిజన్‌లుగా గుర్తించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని 327 యూనియన్ సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్‌ను అన్‌మ్యాన్డ్ వర్కర్స్ కోరారు. సోమవారం ఆయనను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. విధి నిర్వహణలో మరణించిన అన్‌మ్యాన్డ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు కుటుంబానికి కోటి రూపాయాల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాబోయే జేఎల్ఎంలో వెయిటేజీ మార్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుర్రి సుధాకర్, కార్యదర్శి నందిపాటి వెంకన్న, డేగ రవి, వెంకన్న, పాండే, గంగన్న, రంగన్న, బిక్షపతి, భద్రు, రఫీ, నరేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఏకైక అతి పెద్ద సంఘం, ఏ రాజకీయ పార్టీ భావజాలానికి దగ్గర లేని సంఘం పీఆర్‌టీయూ అని, సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. వరంగల్‌లోని ఆకుతోట కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించిన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లా శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, పల్లి శ్రీహరి, ఈదునూరి రవీందర్‌రెడ్డి, లక్కిరెడ్డి మహేందర్‌తో పాటు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

నెక్కొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ - ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య పెద్దకొర్పోలు రైల్వే గేటువద్ద సోమవారం ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు కింద పడి 30 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకొర్పోలు రైల్వే గేటు సమీపంలో గ్రామంలోని ఓ రైతుకు చెందిన గొర్రెలు మేత మేస్తున్నాయి. ఈ క్రమంలో గొర్రెల మంద వెంట కుక్కలు పడి వాటిని తరమడంతో కుక్కల బారి నుంచి తప్పించుకోవడానికి గొర్రెలు రైల్వే ట్రాక్‌పైకి పరుగు పెట్టాయి. ఇదే సమయంలో కాజీపేట వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గూడ్సు రైలు కింద ప్రమాదవశాత్తు పడిన గొర్రెలు మృతి చెందాయి. ఈ ప్రమాదం కారణంగా రూ. 3 లక్షల వరకు నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రకృతిని తలిచే సీత్లా

- లంబాడీల తొలి పండుగ ఇదే
- యేటా పెద్దపుషాల కార్తెలో జరుపుకోవడం ఆనవాయితీ
- నేడు జరుపుకునేందుకు సన్నద్ధమవుతున్న గిరిజనులు
- పండుగ రోజున సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్

నెహ్రూసెంటర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : లంబాడ గిరిజనులు పాడి పంటలు, పశుసంరక్షణ కలగాలని.. సకాలంలో వర్షాలు బాగా పడాలని.. ప్రకృతిని తలచుకుని సంప్రదాయబద్ధంగా ఏడుగురు కుల దేవతల్లో ఒకరైన సీత్లా భవానిని కొలిచి భక్తి శ్రద్ధల నడుమ జరుపుకునే పండుగ సీత్లా దీనినే (దాటుడు) అని పిలుస్తారు. ప్రతి ఏడాది వర్షాకాల సీజన్ ప్రారంభమవగానే పెద్దపుషాల కార్తె మంగళవారం వచ్చే విధంగా వీలు చూసుకుని గిరిజనులు సీత్లాపండుగను జరుపుకోవడం అనవాయితీ. బంజరాలు జరుపుకునే పండుగల్లో ఇదే తొలి పండుగ. ఈ ఏడాది పెద్ద పుషాల మొదటి మంగళవారం జూలై 8న సీత్లా పండుగను జరుపుకోవడానికి గిరిజనులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు పండుగ జరుపుకోవాలని వ్యూహం చేస్తున్నారు.

పూర్వ కాలం నుంచే...

గిరిజన తండాల్లో పూర్వ కాలం నుంచే సీత్లా పండుగ ఆచారాలు కొనసాగుతున్నాయి. బంజరాలు పూర్వ కాలం నుంచి వందల సంఖ్యలో పశుసంపదను కలిగి ఉండేవారు. వాతావరణంలో స్వల్ప మార్పులు వచ్చినప్పుడల్లా పశువులు రోగాల బారీనపడేవి. వర్షాకాలం మొదలు కాగానే తండాల్లోని పశువులు వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండేవి. పశువులకు జ్వరం, విరేచనాలు, కాలు డెక్కలు చెడిపోవడం, నోరు చెడి మేత మేయకపోవడం లాంటి లక్షణాలతో పశువులు మృత్యువాత పడుతుండేవి. మనుషులకు వాంతులు, విరేచనాలు (గత్తర) కలరా వ్యాధితో వైద్యం అందుబాటులో లేక అనేక మంది మృతి చెందారు. దీంతో భయాందోళనకు గురైన గిరిజనులు సీత్లామాతను పూజిస్తూ గొర్రెపోతును బలి ఇచ్చి రోడ్డుకు ఇరువైపులా పేగులు అల్లి వాటిపై నుంచి పశువులను దాటిస్తారు. నవధాన్యంలో గొర్రెపోతు రక్తం కలిపి పశువులపై చల్లుతారు. ఈ సీత్లాపండుగ ఆచారం పూర్వకాలం నుంచి కొనసాగుతూ వస్తోంది.

సీత్లాభవానికి పూజా ఇలా...

పశుసంపద రక్షణ కోసం గోర్ బంజారాలు ఏడుగురు దేవతలైన మేరామా, తోళ్జా, మాత్రాల్, కంకాళి, హింగ్లా, ద్వాళంగర్, సీత్లా మాతలను పూజిస్తారు. వీరితో పాటు వారికి రక్షణగా ఉండే లుకిడ్యాను సైతం కొలుస్తారు. వర్షకాల ఆరంభంలో పునర్వసు పెద్దపుషాల కార్తెలో ఏదైన ఒక మంగళవారం వీలు చూసుకుని సీత్లామాతను కొలుస్తారు. అన్ని పండుగల వలే ఇండ్లలో కాకుండా తండాకు దగ్గరగా ఉండే చెరువు ఒడ్డున లేదా రోడ్డుపై ఈ పూజ చేస్తారు. పొడవటి రాళ్లతో తయారు చేసిన ఏడు ప్రతిమలను ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుకిడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు. తండాల్లోని మహిళలు, ఆడపడుచులు(లాప్సి) నైవేద్యం, నవ ధాన్యాలు, పరశుభ్రమైన నీటిని తీసుకుని పాటలు పాడుతూ... నృత్యాలు చేసుకుంటూ దేవతలను ప్రతిష్ఠించిన ప్రదేశానికి చేరుకుంటారు. సీత్లా మాతకు లంబాడీల ఆచరణ సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధల నడుమ కొలుస్తారు. సల్లాంగ నూడు తల్లి అంటూ వేడుకుంటారు.



లుకిడ్యా ప్రతిమపై జలాభిషేకం చేస్తున్న గిరిజన మహిళలు (ఫైల్)



సీత్లాభవాని ప్రతిమవద్దకు డప్పుచప్పుళ్లతో వస్తున్న గిరిజనులు (ఫైల్)



ప్రతిష్ఠించిన ఏడుగురు కుల దేవతులు (ఫైల్)

లంబాడీల పండుగలకు గుర్తింపు లేదు.



గుగులోతు కిషన్‌నాయక్, గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు, మహబూబాబాద్

లంబాడ గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే సీత్లాపండుగకు పాలకులు గుర్తింపు ఇవ్వడం లేదు. అన్ని కులాలు, మతాలు నిర్వహించుకునే పండుగలకు గుర్తింపు, సెలవు దినాలు ఉన్నా.. లంబాడాలు నిర్వహించుకునే పండుగలకు మాత్రం గుర్తింపు లేకుండా పోయింది. బంజార జాతి పండుగలకు గుర్తింపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి.

సెలవుదినంగా ప్రకటించాలి..



నెహ్రూరాథోడ్, వైద్యుడు మహబూబాబాద్

లంబాడ గిరిజనులు నిర్వహించుకునే పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు జూలై 8న జరుపుకోవాలి. గిరిజనులు సీత్లాపండుగను పెద్దపుషాల కార్తెలో మొదటి, లేదా రెండవ మంగళవారం జరుపుకునేవారు. అలా కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు జరుపుకునే విధంగా ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. అందుకు గిరిజనులు ఒకే రోజు పండుగ జరుపుకుని ఐక్యత చాటాలి.

యువతే ఈ దేశ భవిష్యత్తు

వారి చేతుల్లోనే వికసిత్ భారత్
- జ్ఞానం సద్వినియోగంతోనే సత్ఫలితాలు
- సైన్స్ రంగంలో ఐఐసీటి విజయాలు విప్లవాత్మకం
- సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నేటి ప్రపంచంలో జ్ఞాన సముపార్జన ఒక్కటే సరిపోదని, దానిని ఏ మేరకు ఎలా ఉపయోగించాలన్నది కూడా ముఖ్యమని సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవం క్యాంపస్‌లోని ఆడిటోరియంలో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి స్నాతకోపన్యాసం చేశారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సృజనాత్మకత, కమ్యూనికేషన్, వాస్తవిక ప్రాపంచిక నైపుణ్యాలు అవసరమని అన్నారు. మనం ఏ రంగంలో ఉన్నమనేదికాదు.. భిన్నంగా ఆలోచించడం, ఆలోచనలను ఇతరులతో స్పష్టంగా పంచుకోవడం, వారితో కలిసి ప్రతిభావంతంగా పని చేయడం ముఖ్యమని.. అప్పుడే మరింత ముందుకు వెళ్లగలమని అన్నారు. యజమానులు డిగ్రీలను చూసి ఉద్యోగులను నియమించుకోవడం కాకుండా వారు ఆలోచనాపరులా కాదా, సమస్యను పరిష్కరించగలరా లేదా, టీమ్ ప్లేయర్లా కాదా అనేది చూడాలన్నారు. మనలోని సాంకేతికత, ఆటోమేషన్, ప్రతిభ, విస్పష్టమైన ఆలోచనా ధోరణి మిగతావారికన్నా భిన్నంగా, ప్రత్యేకంగా నిలబెడుతాయని శ్రీనివాస రెడ్డి అన్నారు. భారత దేశం ఒక కొత్త శక్తితో, సరికొత్త ఆకాంక్షలతో ముందుకు వెళుతోందన్నారు. వందవ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగడానికి మన కంటూ వికసిత్ భారత్-2047 అనే స్పష్టమైన జాతీయ స్వప్నదర్శనం ఉందన్నారు. అయితే ప్రభుత్వ విధానాల వల్ల మాత్రమే ఈ కల సాకారం కాదని, యువ పౌరుల శక్తి, సృజనాత్మకతపైనే ఇది ఆధారపడి ఉందని అన్నారు. యువత ఈ దేశ భవిష్యత్తు మాత్రమే కాదని, వారు ఈ దేశ స్థితిని, గతిని మార్చగల శక్తిమంతులని అన్నారు.

సైన్స్ అంటే కొత్తవాటిని కనుగొనడానికి ఉద్దేశించింది మాత్రమే కాదు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అది పరిష్కరిస్తుంది, ఎందరి జీవితాలనో మార్చివేస్తుంది. కొత్త భవిష్యత్తును నిర్మిస్తుంది అన్నారు. ఇండియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటి) ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. చౌకయిన మందుల తయారీ, కోవాక్సిన్ బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్కిన్స్, కంపోస్టబుల్ ప్లాస్టిక్, ఏజీఆర్ టెక్నాలజీ ఐఐసీటీ సాధించిన విప్లవాత్మక విజయాల్లో కొన్ని అన్నారు. సైన్స్, కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్నవారిని తమ సంస్థ ఆహ్వానిస్తోందన్నారు. ఇంటర్న్‌షిప్స్, ఫెల్లోషిప్స్ అందజేయడతో పాటు పరిశోధన అవకాశాలను కల్పిస్తుందన్నారు. ప్రపంచ వాస్తవిక సవాళ్లు మొదలు కొని కాలుష్య రహిత ఎనర్జీ, చౌకయిన వైద్యం వరకు ఎటువంటి సమస్యలనైనా పరిష్కంచే యజ్ఞంలో తమతో చేయి కలపాల్సిందిగా ఐఐసీటీ డైరెక్టర్ పిలుపునిచ్చారు. తాము చదువుకున్న విద్యాలయాన్ని వదిలివేళ్లే విద్యార్థులు దాని పట్ల కృతజ్ఞతతో ఉండాలని, నైతిక విలువలకు కట్టుబడాలని, కుటుంబాన్ని, తమ మూలాలను మరవరాదని ఉద్బోధించారు. యువతే ఈ దేశ భవిష్యత్తు, వికసిత్ భారత్ సాకారానికి చేయూతలు అని గుర్తు చేశారు. యువత నిత్యాన్వేషిగా ఉండాలని, మార్పును ఆస్వాదించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అనేక మంది ఇంగ్లీష్ రాకపోవడం ఒక లోటుగా భావిస్తున్నారనీ, కానీ భాష మన ఆలోచనలు పంచుకోవడానికి ఒక సాధనం మాత్రమేనని, మనం ఏం చెబుతున్నామని కాదనీ, మనం ఏం చేసి చూపిస్తున్నామనేది ముఖ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తాను కూడా ఇంగ్లీష్ రాక మొదట్లో ఇబ్బందిపడ్డానని, కానీ దానిని అధిగమించేందుకు చాలా శ్రమ పడ్డానన్నారు. మాస్టర్ డిగ్రీ చేసేప్పుడు పేపర్‌బాయ్‌గా పని చేసిన రోజులను గుర్తు చేసుకున్నారు.



పీహెచ్‌డీ పట్టాలు అందుకుంటున్న స్కాలర్లు



తెలుగు స్కాలర్ దివ్యాంగులు శ్యాం ప్రసాద్ కు డాక్టరేట్ పట్టాను ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వీసీ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం



స్క్రీన్‌ల వద్ద ఫోటోలు తీసుకుంటున్న డాక్టరేట్ అభ్యర్థుల కుటుంబ సభ్యులు

కేయూ ప్రస్థానం ఆదర్శనీయం

- ఉన్నత విద్యావ్యాప్తిలో కీలక భూమిక
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావాప్తిలో కాకతీయ విశ్వవిద్యాలయం కీలక భూమిక పోషిస్తోందని గవర్నర్, కేయూ చాన్సలర్ కూడా అయిన జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. కేయూ 23వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణలో ఉన్నత విద్యలో సంస్కరణాత్మక ప్రస్థానానికి శ్రీకారం చుట్టిందన్నారు. జాతీయ విద్యావిధానం అమలులో కేయూ కీలక భూమిక పోషిస్తోందని ప్రశంసించారు. స్నాతకోత్సవం అనేది ఒక ఉత్సవం మాత్రమే కాదని పట్టాలు అందుకున్న విద్యార్థులు విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు పడే భవిష్యత్ బాట అని అన్నారు. పరిశోధన, అభివృద్ధి అనేది ప్రయోగశాలలకే పరిమితం కారాదని, వాస్తవిక జీవనంలో ప్రజల మౌలిక అవసరాలను తీర్చే, వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకురాగలిగే ఆలోచనలకు కేంద్రంగా ఉండాలని అన్నారు. యువత ఈ రోజు సైన్స్ రంగంలో సరికొత్త మైలురాళ్లను నాటుతున్నారన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇందులో ఎంతో వాస్తవ ముందని అన్నారు. పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) ప్రయోగశాలల్లోనే కాకుండా నిజజీవితంలో సేవ చేయడానికి, ప్రజల జీవితంలో మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించినదిగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయం 2023లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం పట్ల, 2024లో ఎన్ఐఆర్ ప్రకటించిన టాప్ 151-200 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల జాతీయ స్థాయిలో 84వ ర్యాంకును, యూఐ గ్రీన్ మెట్రిక్స్‌లో మూడో స్థానంలో నిలవడం, తెలంగాణలోనే నెంబర్ వన్‌గా ఉండడం గర్వకారణం అని ప్రశంసలు కురిపించారు. జాబ్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టడం, క్రీడలు, సంస్కృతిని పెంపొందించడంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉన్నత విద్యాప్రమాణాలను నిలబెట్టడంలో, విద్యారంగంలో ఎదురవుతున్న నూతన సవాళ్లను ఎదుర్కోవడంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తోందన్నారు.

పరిశోధనలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

ఈ ఏడాది గోల్డెన్ జూబ్లీ వేడుకలు • వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో వీసీ ప్రతాప్‌రెడ్డి సమాలోచనలు



పీహెచ్‌డీ పట్టాలు చూపుతున్న స్కాలర్లు

కేయూ క్యాంపస్ జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తోందని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేయూ ఆడిటోరియంలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లోకి ప్రవేశిస్తోందన్నారు. న్యూఢిల్లీలోని యూజీసీ, అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ)తో పాటు ఇతర సంస్థల సహకారంతో వర్సిటీ అకాడమిక్‌గా ముందుకు సాగుతోందని చెప్పారు. కేయూ నుంచి 387 మంది పీహెచ్‌డీ డిగ్రీలు, 564 మంది బంగారు పతకాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. న్యాక్ అక్రిడేషన్‌లో 3.27 సీజీపీఏ స్కోర్ సాధించినట్లు పేర్కొన్నారు. గ్రీన్ మెట్రిక్ ర్యాంకులో అత్యున్నత స్థానం పొందినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కేయూ గతంలో కన్నా రూ. 50 కోట్లు పెంచిందన్నారు. ఇటీవల రుసా 2.0 కింద రూ.50 కోట్లు కేటాయించిందన్నారు. వర్సిటీలో కె.హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తామన్నారు.

ఈ ఏడాది వర్సిటీ 50 వసంతాల పండుగను పురస్కరించుకుని గోల్డెన్ జూబ్లీ అకాడమిక్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. పీవీ నరసింహరావు నాలెజ్జ్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వెయ్యి మంది ఉండేందుకు నూతనంగా మహిళ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సెంటీనరీ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానికల్ లర్నింగ్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పబ్లిక్ హెల్త్‌తో పాటు ఇతర అంశాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కేయూ ఎన్‌సీసీ విద్యార్థులు న్యూఢిల్లీ పబ్లిక్ పరేడ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కేయూలో అలుమ్ని విద్యార్థుల సహకారం గొప్పదన్నారు.



స్నాతకోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టరేట్ పొందిన అభ్యర్థులు

సందడిగా స్నాతకోత్సవం

కేయూ క్యాంపస్ జూలై 7(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం కన్నుల పండువగా సాగింది. డాక్టరేట్‌లు పొందిన విద్యార్థులందరూ తెల్లదుస్తులు ధరించి ఆడిటోరియంలోకి వచ్చారు. విభాగాల వారీగా సీట్లలో కూర్చున్నారు. ఆడిటోరియం వద్ద వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతోపాటు పాలక మండలి సభ్యులు, అకాడమిక్ సెనెట్ సభ్యులందరూ పుష్పగుచ్ఛాలు అందచేసి గవర్నర్‌కు స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ఆడిటోరియంలోకి లయబద్ధమైన చప్పుళ్ళ మధ్య స్టేజీ మీదకు చేరుకున్నారు. డాక్టరేట్‌లు సాధించిన అభ్యర్థులతో వీసీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పా లక మండలి సభ్యులు, డీన్‌లు బి. సురేశ్ లాల్, నిమ్మ సుదర్శన్, కె.అనితారెడ్డి, బాలు చౌహాన్, సుకుమారి, చిర్ర రాజు, పు ల్లూరి సుధాకర్, గాదె సమ్మయ్య, జి.హన్మంతు, శ్రీనివాస్, మంచాల సదానందం, ఎస్.రాంనాథ్‌కిషన్, కట్ల రాజేందర్ పాల్గొన్నారు.



బంగారు పతకం పొందిన విద్యార్థిని ముద్దాడుతున్న తల్లి



పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఆనందంలో సెల్ఫీ

గిరిజన బిడ్డకు నాలుగు బంగారు పతకాలు

- ఎల్ఎల్‌బీలో నాలుగు విభాగాల్లో ప్రతిభ
- ఆర్థిక ఇబ్బందులను అధిగమించిన హరిభూషణ్

రఘునాథపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదరికంలో పుట్టినా.. పట్టుదలతో చదివి ఏకంగా నాలుగు బంగారు పతకాలను అందుకుని శభాష్ అనిపించుకున్నాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దబండతండాకు చెందిన గిరిజన బిడ్డ బానోతు హరిభూషణ్ నాయక్ నాలుగు బంగారు పతకాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా కేయూలో జరిగిన 23వ స్నాతకోత్సవంలో సోమవారం అందుకున్నారు. బానోతు భిక్షపతి నాయక్-జమున బాయి దంపతుల నాల్గవ కుమారుడు హరిభూషణ్. పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటునే ఐదు సంవత్సరాల న్యాయ విద్యను అత్యుత్తమంగా పూర్తి చేశాడు. ఎల్ఎల్‌బీ కోర్సులో మొత్తం ప్రతిభ, ఫ్యామిలీ లా (పేపర్ 1 అండ్ 2), లా ఆఫ్ ఎవిడెన్స్, హిందూ లా సబ్జెక్టులలో మొత్తం నాలుగవ బంగారు పతకాలను సాధించి ఔరా అనిపించాడు. హరిభూషణ్ నాయక్ మాట్లాడుతూ పేదరికం ఉన్నత చదువులకు అడ్డు కాదని, కష్టపడి చదివితే సాధ్యం కానిది ఏది లేదన్నారు. ఈ విజయం నా కుటుంబానికి.. నా తండాకు అంకితమన్నారు.



గవర్నర్ చేతులమీదుగా బంగారు పతకాలను అందుకున్న హరిభూషణ్‌నాయక్

స్నాతకోత్సవంలో ఉల్టా .. పల్టా...

- ప్రతిజ్ఞ లేకుండానే కార్యక్రమం మొదలు
- షెడ్యూల్‌లో పేర్కొన్నదానికి భిన్నం
- పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం


హనుమకొండ, జూలై7 (ఆంధ్రజ్యోతి): స్నాతకోత్సవం అంటే నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తు.చ తప్పకుండా టైమ్ ప్రకారం జరుగుతుంది. అలా జరిగేలా ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ఇదంతా ఒక ప్రక్రియ. కానీ సోమవారం జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం23వ స్నాతకోత్సవం ఇందుకు భిన్నంగా జరిగింది. ముందుగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా కాస్త అటు.. ఇటుగా జరిగింది. నిర్దేశిత షెడ్యూల్ క న్నా గవర్నర్ 20నిముషాలు ఆలస్యంగా స్నాతకోత్సవం జరిగే హాల్‌లోకి ప్రవేశించారు. అది అటుంచితే షెడ్యూల్ ప్రకారం గవర్నర్ స్నాతకోత్సవం ప్రొసీడింగ్స్‌కు అనుమతిచ్చిన తర్వాత పట్టభద్రులతో ముందుగా ప్రతిజ్ఞ చేయించాలి. ఆ తర్వాత వైస్‌చాన్సలర్ నివేదిక సమర్పించాలి. తదనంతరం ముఖ్య అతిథి స్నాతకోత్సవ ప్రసంగం, అనంతరం చాన్సలర్ (గవర్నర్) ప్రసంగం ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా చాన్సలర్ స్నాతకోత్సవం ప్రొసీడింగ్స్‌కు అనుమతిచ్చిన తర్వాత తొలుత పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించకుండానే వైస్‌చాన్సలర్ నేరుగా నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ముఖ్య అతిథి ప్రసంగించారు. పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించలేదన్న విషయం గుర్తుకు వచ్చినట్టున్నది. అప్పుడు వారితో ప్రతిజ్ఞ చేయించిన మీదట గవర్నర్ తన సందేశం ఇచ్చారు. దీంతో స్నాతకోత్సవానికి హాజరైనవారు ఇదేం తీరు అంటూ విస్తుపోయారు.

నీరసం.. నిరుత్సాహం

స్నాతకోత్సవంలో పట్టాలు, పతకాలు అందుకున్నవారిలో ఎవరూ అంతగా ఉత్సాహంగా కనిపించలేదు. ఎట్టకేలకు అందుకున్నాం అన్నట్టు నిరుత్సాహంగా తీసుకొని వెళ్లిపోయారు. ఈ పట్టాలు, పతకాలన్నీ 2020 నుంచి 2025 మధ్య కాలం నాటివి. ఈ పట్టాలు, పతకాలు ప్రదానం చేయడానికి దాదాపు అయిదేళ్ల పట్టింది. పట్టభద్రుల్లో చాలా మంది ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. వారిలో సగం మంది స్నాతకోత్సవానికే రాలేదు. ఈ అయిదేళ్లలో పిహెచ్‌డి పట్టాలు పొందినవారు 579 మంది కాగా వీరిలో 161 కాన్వొకేషన్ కాక ముందుకే తీసుకున్నారు. ఇక మిగిలిన 418 మందిలో ప్రత్యక్షంగా వచ్చి తీసుకున్నది 387 మంది. ఇక బంగారు పతకాల విషయానికి వస్తే 2015-16 నుంచి 2020-21 వరకు అంటే ఆరేళ్ళ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 564 బంగారు పతకాలు. 373 మంది విద్యార్థులకు వీటిని ప్రదానం చేశారు.

వరి నారుమళ్లు.. యాజమాన్య పద్ధతులు

- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు
- సస్యరక్షణచర్యలు తప్పనిసరి అంటున్న వ్యవసాయాధికారులు



పొడి వరి నారుమడి

కాటారం, జూలై 7(ఆంధ్రజ్యోతి):వానాకాలం సీజన్‌లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతాంగం నారుమళ్లను సిద్ధం చేసి వడ్లు అలుకుతున్నారు. బోర్ల కింద సన్న రకాలైన ఎంటీయూ-1224, 1281, 1282, బీపీటీ, తెలంగాణ సోనా, ఎంటీయూ 1010, జేజీఎల్, సాంబ మసూరిలతో పాటు పలు ప్రైవేట్ సీడ్స్‌కు సంబంధించిన వివిధ వెరైటీలతో కూడిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రకాలైన వరి వంగడాలను వేసుకోవడానికి రైతాంగం సిద్ధమైంది. అయితే నాణ్యమైన వరి విత్తనాల ఎంపికతో పాటు నారు మడిలో మంచి యాజమన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను చేపడి తేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో సుమారు 13వేల ఎకరాల్లో వరి సాగు కానున్న నేపథ్యంలో వానాకాలం వరి నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల వ్యవసాయాధికారి పూర్ణిమ రైతులకు ఇలా అవగాహన కల్పిస్తున్నారు.

దీనికోసం చేయాల్సిన యాజమాన్య పద్ధతి..

ఎకరాకు 30-40 కిలోల వరి విత్తనాలు అవసరమవుతాయి. 20 సెంట్ల విస్తీర్ణంలో విత్తనాలు వేసుకోవాలి. 1.5 మీటర్ల వెడల్పుతో ప్లాట్స్ లాగా చేసుకొని విత్తనాన్ని వేయాలి. విత్తనం వేసే ముందు కిలో విత్తనానికి 3-4 గ్రాముల కాప్టన్ లేదా థైరంతో విత్తన శుద్ధి చేసుకోవాలి. దుక్కిలోనే హెక్టర్‌కు 1 టన్ను పశువుల ఎరువు లేదా సేంద్రీయ ఎరువు వేసుకోవాలి. మూడు కిలోల బాస్వరం ఇచ్చే ఎరువు, రెండు కిలోల పోటాష్‌ను వేయాలి. ఈ పద్ధతిలో ముఖ్యంగా ఐరన్ మరియు పోటాషియం లోపం కనిపిస్తుంది. దీనిని నివారించుకోవడానికి సూక్ష్మపోషకాలను పిచికారి చేసుకోవాలి.



మ్యాట్ మీద నారును చుడుతున్న రైతులు (ఫైల్)

వరి నారుమడులు సాధారణంగా మూడు రకాలు:-

1) పొడి నారుమడి 2) బురద నారుమడి 3) మ్యాట్‌పై నారుమడి మండలంలో ముఖ్యంగా పొడినారుమడి, బురద నారుమళ్లనే ఎక్కువగా ఉపయోగిస్తారు.పొడి నారుమడి అనగా...పొడి దుక్కిలోనే పొడి వడ్ల గింజలను వెదజల్లి మట్టిని కప్పడం జరుగుతుంది. వర్షపు నీటి ఆధారంతో, బోరు బావుల ద్వారా నీటిని అందించడంతో నారు మొలుస్తుంది. ఈ పద్ధతిని ముఖ్యంగా చెరువుల, కుంటలు, కాలువల కింద, మొదట నీటి వసతి లేకుండా వర్షపు నీటిపైనా ఆధారపడే ప్రదేశాల్లో ఉపయోగిస్తారు.

బురద నారుమడి అనగా..

ఈ పద్ధతిలో దుక్కిని నీటితో తడిపి బురదలాగా చేయడం జరుగుతుంది. వడ్లను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి తీసిన అనంతరం మరో 24 గంటల పాటు మండె కట్టి తర్వాత చిన్నగా మొలకెత్తిన వడ్ల గింజలను(స్ప్రౌడ్స్)దమ్ము చేసిన మడిలో వెదజల్లుతారు. బోరు బావుల కింద, నీటి వసతి గల భూముల్లో ఈ పద్ధతిని సాగు చేయాలి.

వరి నారుమళ్లల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

- ఎస్ఎంఎస్ పూర్ణిమ, ఏవో కాటారం



నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని నారు పోసుకుని సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి, వడ్లను ముందే విత్తనశుద్ధి చేసుకుంటే పలు రోగాలు, తెగుళ్లను నివారించుకోవచ్చు. నారుమళ్లలో సరైన విధంగా ప్లాట్స్‌ను తయారుచేసుకుని విత్తనాలు చల్లుకోవాలి.

దీని కోసం పాటించాల్సిన యాజమన్య పద్ధతులు

ఎకరాకు 20-25 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. 20 సెంట్ల విస్తీర్ణంలో మొలకలు వేసుకోవాలి. హెక్టార్‌కు ఒక టన్ను సేంద్రీయ ఎరువు లేదా 25 కిలోల డీఏపీ ఎరువు వేసుకోవాలి. ఒక కిలో విత్తనాలకు ఒక లీటర్ నీటిలో ఒక గ్రాము కార్బండీజం మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలి. ఇందులో 2.5 మీటర్ల వెడల్పుగా బెడ్స్‌ను ఏర్పాటు చేసుకొని మొలకలను చల్లుకోవాలి. సూక్ష్మ పోషకాల లోపం కనిపించదు. ఏ నారు మడిలోనైనా పీకి నాట్లు వేసే వారం రోజుల ముందు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలను వేసుకుంటే పలురకాల రోగాలను నివారించుకోవచ్చునని ఏవో సూచించారు.

మ్యాట్‌పై నారుమడి..

ప్యాడీ ట్రాన్స్‌ప్లాంటర్(వరి నాటు యంత్రం)తో నాట్లు వేయడం కోసం నారుమడిని మ్యాట్లపై వేయడం జరుగుతుంది. యంత్రంలో బిగించడానికి అనుగుణంగా పొలంలో సన్నపాటి మందం గల మ్యాట్లను పరిచి వాటిపై ఎరువులతో కూడిన మట్టిని వేసి నారును పెంచుతారు. నారు పెరిగిన తర్వాత మ్యాట్లను చుట్టి యంత్రాల్లో పెట్టి నాట్లు వేస్తారు. దీని కోసం రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజానికి ఆదర్శం



తొర్రూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తొర్రూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజానికి ఆదర్శమని వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకలలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద యాకమల్లు, బచ్చలి వెంకన్న, సోమారపు ఐలయ్య, మహంకాళి బుచ్చయ్య, భిక్షపతి, వెంకన్న, కొమురయ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

●కేసముద్రం : కేసముద్రం, కల్వలలో సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ మాట్లాడారు. కంటిపూడి అరుణ్‌కుమార్, పొలెపాక శంకర్, బిర్రు యుగేందర్, పొలెపాక నాగరాజు, ఏలియా పాల్గొన్నారు.

●నెల్లికుదురు: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మా ర్పీఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల వెంకన్న జెండా ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ వెంకటేశ్వర్లు, గుండె పాక ఉప్పలయ్య, ఎదళ్ల యాదవరెడ్డి, కాసం లక్ష్మారెడ్డి ,ఆకుతోట సతీష్, దండెపెల్లి సైదులు. గుగులోత్ బాలాజనాయక్, యాలాద్రి పాల్గొన్నారు.

●డోర్నకల్ : డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీలో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల అధ్యక్షులు మాతంగి అనిల్‌కుమార్ సంఘం పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బసిక అశోక్, బోరగళ్ల శరత్‌బాబు, కొత్తపల్లినర్సింగ్, కత్తుల బాలరాజు, గాజుల లక్ష్మణ్, క్రాంతికుమార్, పాపారావు పాల్గొన్నారు.

● గార్ల : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని శాంతియుతంగా నడిపిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మురళీ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 51 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సంఘం జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో దుడపంగు శ్రీనివాస్ రావు, కొత్తపల్లి వెంకన్న. పుల్లురు వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

● కురవి : ఎమ్మార్పీఎస్ మాదిగల హక్కుల కోసం నిరంతరం పోరాడి రిజర్వేషన్లు సాధించిందని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివకుమార్‌మాదిగ అన్నారు. కురవి మండల కేంద్రం, సీరోలు మండలం కాంపెల్లిలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయా కార్యక్రమాల్లో అశోక్‌మాదిగ, శివమాదిగ, పోలెపాక ఎల్లయ్య, మిర్యాల శ్రీనివాస్, కోర్ని సురేష్, కిరణ్‌మాదిగ, వెంపటి శ్రీను, వెంకటేశ్వర్లు, అనిల్, కపిల్‌దేవ్, వినోద్ పాల్గొన్నారు.

● కొత్తగూడ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తగూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎస్డీ డివిజన్ నాయకుడు శ్రీశైలం, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్య వెంకటయ్య, బీఆర్ఎస్ మండల నాయకుడు అజ్మీరా రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కేదాసు ప్రసాద్, బీజేపీ మండల నాయకులు బోనాల ప్రవీణ్, వజ్జ రవి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు మైసు సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

● మరిపెడ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు,ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మరిపెడ విశ్రాంతి భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆ సంఘ సీనియర్ నాయకుడు జినక స్వామి ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు రక్తదానం చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరుగు రవి, వంగూరి బాబు, బంక సుధాకర్, ఐనాల వెంకన్న, వినయ్, ప్రమోద్, అప్సర్, రవి కాంత్, రంగన్న, భిక్షం, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న సమ్మయ్యగౌడ్

గుడుంబా తయారు చేస్తే కఠిన శిక్షలు

మరిపెడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) :గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన శిక్షలు ఉంటాయని ఎస్టీఎఫ్ హైదరాబాద్, తొర్రూరు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు భిక్షారెడ్డి, అశోక్, నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. సోమవారం మరిపెడ మండలంలోని తానంచర్ల, జెండాలతండా, బొత్తలతండా, ధరావత్ తండా, మూలమర్రితండా, తోప్లా తండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, ఎస్టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. క్వింటాన్నర బెల్లం, పది కిలోల పటిక, 33లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఇందుకు కారకులైన 11మంది నిందితులు మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి ఎదుట బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎస్టీఎఫ్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కేసముద్రం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామ సమీపంలో సాయిబాలాజీ గ్రానైట్ క్వారీలో బాంబుల మోతతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన నల్లగొప్పుల హరీష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామానికి సమీపంలోనే క్వారీ ఉండడంతో బాంబు పేలుళ్లతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, క్వారీ వాహనాలతో రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

లైసెన్స్ లేకుండా నారు విక్రయించొద్దు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నర్సరీ లైసెన్స్‌లు లేకుండా మిర్చి, కూరగాయలు తదితర విత్తనాల నారు అమ్మరాదని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న హెచ్చరించారు. జిల్లాలోని పలు మిర్చి, కూరగాయాల నర్సరీలను సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా నర్సరీల యాజమానులతో ఆయన మాట్లాడారు. రైతులు ఆంగీకారం తెలిపిన రకాలను మాత్రమే, పేరుగాంచిన రకాలను వ్యవసాయశాఖ ఆమోదం పొందిన రకాలను నారుగా పెంచాలని సూచించారు.

కొనసాగుతున్న నారాయణపురం దీక్షలు

కేసముద్రం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాపాస్‌పుస్తకాలివ్వాలనే డిమాండ్‌తో మండలంలోని నారాయణపురంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. 'మా భూములకు పట్టాలివ్వండి' అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ దీక్షల్లో మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి, భూపాల్‌రెడ్డి, విష్ణు, దేవ, లచ్చు, రాములు, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, స్వప్న, పద్మ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

డోర్నకల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం మునిసిపల్ కమిషనర్ నిరంజన్‌ను కలిసి కార్మికుల తరుపున సార్వత్రిక సమ్మె నోటీసును అందించారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కొరకు కార్మికు లు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మహబూబాబాద్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహ బూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మానుకోట పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం తొలగించేందుకు శ్రీనివాస సెంటర్‌లో ముత్యాలమ్మ ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా పేయింట్‌తో వైట్‌లైన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై శివ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దినసరి కూలీలుగా విధులు నిర్వహిస్తున్న కాంటిజంట్ వర్కర్ల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు కాంటిజంట్ వర్కులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంటిజంట్ వర్కర్లు ఎస్కే యాకూబి, పగిండ్ల భవాని మాట్లాడారు. కార్యక్రమంలో టి.గీతారాణి, మంగమ్మ, పి.ఉమా, బుచ్చి రాములమ్మ, షైమ తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించని లేబర్ అధికారి

ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

తొర్రూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్మికశాఖ సమయపాలన పాటించకుండా కార్యాలయానికి రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం తొర్రూరు కార్మికశాఖ అధికారి రవి మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా కార్యాలయానికి రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్న లేబర్‌కార్డులు, రెనివల్స్, క్లైమ్స్, ఇతర పనుల కోసం డివిజన్ పరిధిలోని 7 మండలాల నుంచి లబ్ధిదారులు ప్రతిరోజు 100 మంది వరకు వస్తున్నారు. అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికశాఖ అధికారి అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు, ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

● మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి

కురవి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం పేరుతో కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తుందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఆరోపించారు. మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం తొలిసారి కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఆ హామీని ఇప్పటికి అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ విప్‌గా రాంచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యేగా మురళీనాయక్ మానుకోట జిల్లాకు అభివృద్ధి నిధులు తేవడంలో విఫలమ య్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని, లబ్ధిదారుల వద్ద డబ్బులు గుంజుతున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతు రవినాయక్, బాదె నాగయ్య, నూతక్కి నర్సింహారావు, బోడ శ్రీనివాస్, కిశోర్‌వర్మ, చిన్నం భాస్కర్, అర్జున్ చౌహాన్, బొజ్యానాయక్, జుంకీలాల్, దిడ్డి శ్రీను, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా శంకుస్థాపనకు తరలిరావాలి

కేసముద్రం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో ముస్లిం కోసం రూ.80లక్షలతో నిర్మించబోయే షాదీఖానా శంకుస్థాపన కార్యక్రమానికి ముస్లిందరూ తరలిరావాలని కులసంఘం అధ్యక్షుడు షేక్ ఖాదర్ కోరారు. కేసముద్రం విలేజిలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న షాదీ ఖానా నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఆయన వెంట సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ నయీం, అక్బర్, అమీర్‌పాషా, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

తొర్రూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పని గంటల పరిమితిని 8 నుంచి 10 కి పెంచిన జీవోను ఉపసంహరించుకోవాలని ఈనెల 9న జరిగే ఐక్య కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం తొర్రూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. ఆయా రంగాల వ్యాపారులు, ఫ్యాక్టరీల యజమానులు సహకరించాలన్నారు. వేమ భిక్షపతి, కొత్తపల్లి రవి, బొల్లం అశోక్, ఆంజనేయులు, మహేందర్, కిరణ్, వెంకన్న, యాకయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్ నాయక్

నెల్లికుదురు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్ తెలిపారు. నెల్లికుదురు చెరువును సోమవారం ఆయన పరిశీలించారు .ప్రభుత్వం చెరువుల అభివృద్ధిచేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. రత్తిరాతండాలో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఐటీడీఏ ఏఈ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలను తమ దష్టికి తీసుకరావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో బాలరాజు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దంపతులపై గొడ్డలితో దాడి

బక్క చంద్రు తండాలో ఘటన



గాయపడిన క్షతగాత్రుడు

నర్సింహులపేట, జూలై 7(ఆంధ్ర జ్యోతి): ఇంటి ఖాళీ స్థలం విషయంలో జరిగిన గొడవలో బార్యాభర్తలపై గొడ్డలితో దాడి చేయగా తీవ్ర గాయలైన సంఘటన మండలంలోని వస్రం తండా జీపీ పరిధిలోని బక్కచంద్రు తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బక్కచంద్రు తండాకు చెందిన బానోతు మంగ్య ఇంటి పక్కన అదే తండాకు చెందిన బానోతు భద్రుకు కొంత ఖాళీ స్థలం ఉంది. భద్రు కొద్ది రోజుల క్రితం ఆయన ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి వద్ద లేని మంగ్య ఫెన్సింగ్ తన స్థలంలో వేశారని కోపం పెంచుకుని ఆదివారం తండాకు వచ్చిన భద్రు భార్య బాలిపై గొడవపడి చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె హైదరాబాద్‌లోని కుమారులు కల్యాణ్, మనోజ్‌లకు తెలపడంతో వారు ఇంటికి వచ్చారు. ఆదివారం రాత్రి తండాకు చేరుకున్న ఇద్దరు కుమారులతో పాటు తండ్రి భద్రు సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో నిద్రపోతున్న మంగ్య, అతడి భార్య ద్వాలిలపై గొడ్డలి, రోకలి బండలతో దాడి చేసి పారిపోయారు. దీంతో వారి కేకలు విన్న చుట్టు పక్కల వారు గమనించి రక్తపు మడుగులో ఉన్న ఇద్దరిని 108లో మహబుబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మంగ్య అల్లుడు లాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బద్రు, కల్యాణ్, మనోజ్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో జలాల మళ్లింపు..

● కాంగ్రెస్ నాయకుల ధర్నా, కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బయ్యారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో సీతారామ ప్రాజెక్టు జలాల మళ్లింపు జరిగి బయ్యారం పెద్ద చెరువుకు శాపంగా మారిందని బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువుకు తీరని అన్యాయం జరగడాన్ని నిరసిస్తూ సోమవారం బయ్యారంలో రైతులతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత గాంధీ సెంటర్ నుండి మాజీ సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మతో శవయాత్రగా బయలుదేరి బస్టాండ్ సెంటర్‌లో దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు, రైతులు కిషన్ నాయక్, ప్రవీణ్ నాయక్, శ్రీనివాస్, ఈర్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, రంగయ్య, నాగేశ్వరరావు, రాము నాయక్, రామనాథం, వెంకపతి, సీతారామిరెడ్డి, మల్లిఖార్జున్, మంగీలాల్, రవి నాయక్, మోహన్, అమృతరెడ్డి, ఉపేందర్, నాగరాజు, శ్రీధర్, వీరలక్ష్మీ, వెంకటరమణ పాల్గొన్నారు.

జలాల మళ్లింపునకు కారకులు కనకయ్యే

బయ్యారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం, గార్ల మండలా లకు సీతారామ జలాలు అందించాలని 2016లో నాటి సీఎం కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రోళ్లపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా.. అసలు పాలేరు జలాశాయానికి గోదావరి జలాల మళ్లింపుకు కారకులే నాటి, ప్రస్తుత ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్ విమర్శిం చారు. తెలంగాణ రథసారధి అయినటువంటి మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయటం హైయమైన చర్యగా బీఆర్ఎస్ శ్రేణులు అభివర్ణించారు. ఈ సందర్భంగా బయ్యారంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గణేష్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, ఐలయ్య, మురళి, లక్ష్మణ్ నాయక్,శ్రీను, దేవోజీ, శివాజీ, వీరభద్రం, జగన్, వీరన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలంలోని ముత్యాలమ్మగూడెం, రెడ్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జమాండ్లపల్లి, కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని, కన్వర్‌టెడ్ గురుకుల పాఠశాలల రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదలచేసి, పీఆర్సీని ప్రకటించి అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంజీవ, రాజశేఖర్, సూర్యతేజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

బేతోలులో మోహర్రం పండుగ



బేతోలులో పీరీలతో వస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని బేతోలు గ్రామంలో సోమవారం ముస్లింలు మోహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం వీరులు హుస్సేన్ హుసేన్ స్మారకార్థం పీరీలను తయారు చేసి వాటికి తొమ్మిది రోజులు ప్రార్థనలు చేసి పదో రోజు సోమవారం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్. యూసూఫ్, మస్తాన్, షరీఫ్, ఖాదర్‌బాబా, షబ్బీర్, పాషా, ఖయ్యూం, ఖాజా, లతీఫ్, జావిద్, ఫిరోజ్, రహీం, నజీర్, ఇమామ్, జానీ పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : మండలంలోని ఉగ్గంపల్లిలో తొమ్మిది పాటు పీరీల సందడి నెలకొంది. చివరి రోజైన సోమవారం దర్గా ఎదుట ఉన్న అగ్ని గుండం చుట్టూ పీరీలను చేతభూని ఆసైదులా అంటూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం పీరీలను సంప్రదాయం ప్రకారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఖలీల్, ఈసుబ్, యాకుబ్, ఇంతియాజ్, భర్తపురం కొమురెల్లి, బీసు మల్లేషం, ముత్యం సత్యం, బెల్లంకొండ వెంకన్న, యాకన్న, ఏకాంబ్రం, ప్రశాంత్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమితి నూతన ఎన్నిక



విజయసారథి



అజయ్‌సారథి

కురవి, జూలై 7 (ఆంధ్ర జ్యోతి) :కురవిలో రెండురోజుల పాటు జరిగిన సీపీఐ జిల్లా మహాసభల్లో నూతన జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మూడవసారి బి.విజయసారథి తిరిగి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా నల్లు సుధాకర్‌రెడ్డి, బి.అజయ్‌సారథి నియామకమయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, సీహెచ్. వెంకన్న, నెల్లూరి నాగేశ్వర్‌రావుతో పాటు మరో 24 మంది కౌన్సిల్ సభ్యులను మహాసభలో ఎన్నుకున్నారు. జిల్లా 3వ మహాసభ తీర్మానాలను ప్రకటించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలని, కురవిని పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని, రాంపురం హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని, తొర్రూరు ఏటీవో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, సీతారామ ప్రాజెక్టు ద్వార బయ్యారం మండలం, డోర్నకల్ నియోజకవర్గానికి సాగు నీరు అందించాలని, డోర్నకల్‌లో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని, డోర్నకల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని పలు తీర్మాణాలు చేశారు.

సమన్వయం సవాలే!

(5వ పేజీ తరువాయి)

నియమించారు. ఇక జూన్ 29వ తేదీన పార్లమెంట్ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జిలను అధిష్టానం నియమించింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి చిట్ల సత్యనారాయణ, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోట్ల నాగేశ్వరావును అధిష్టానం నియమించింది. అయితే మహబూబాబాద్ జిల్లా పరిశీలకుడిగా, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పోట్ల నాగేశ్వర్‌రావునే రెండు పదవుల్లో నియమించటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న నాయకులు సంస్థాగత ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి, గ్రామ, మండల బ్లాక్ స్థాయిలో ఎన్నికలు నిర్వహించేందుకు కార్యచరణ సిద్ధం చేశారు.

తెరపైకి మంత్రి అడ్లూరి

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలుగా ఇద్దరు మంత్రులకే అవకాశం ఇవ్వగా, మిగతా వారంతా పార్టీ సీనియర్ నేతలే ఉన్నారు. ఇద్దరు మంత్రులు కూడా పూర్వ కరీంనగర్‌కు చెందిన వారే కావటం విశేషం. వీరిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమించగా, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా పిలిచే ఉమ్మడి వరంగల్ జిల్లాకు పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు.

అసంతృప్తులు, వర్గవిభేదాలతో ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ అట్టుడుకుతోంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ మేయర్‌తో పాటు పార్టీ కీలక నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో నేతలను సమన్వయం చేసుకుని, పార్టీ ఎన్నికలను పూర్తి చేయటం మంత్రి అడ్లూరికి సవాల్‌గా మారనుందనే చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ సంఘం విచారణలో ఉంది. తమ ఫిర్యాదుపై వెనక్కి తగ్గేందుకు ఎమ్మెల్యేలు ససేమిరా అంటున్నారు. క్రమశిక్షణ సంఘం వద్దకు వచ్చి ఫిర్యాదుపై చర్చించాలలని చైర్మన్ మల్లు రవి ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నారు. అయితే రేపు, మాపు అంటు తప్పిస్తున్న ఎమ్మెల్యేలు ఎట్టకేలకు ఈ నెల 9వ తేదీ లేదా 10న రవిని కలిసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను సమన్వయం చేయటం ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న మంత్రి అడ్లూరికి సవాల్‌గా మారనుందనే టాక్ వినబడుతోంది. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులతో పాటు సీనియర్ నేతలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతిమాధవ రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, బలరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు. వీరందరిని సమన్వయం చేయటం అడ్లూరికి సవాలే అనే టాక్ ఉంది.

కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేయాలి



జిల్లాలోని కంబాలపల్లి పీహెచ్‌సీలో కుష్ఠువ్యాధి నిర్మూలన రాష్ట్ర బృందంతో జిల్లా వైద్య సిబ్బంది

మహబూబాబాద్ క్రైం/ మహబూబాబాద్ రూరల్ జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపన కోసం ప్రతీ పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర పారామెడికల్ వైద్య బృందంతో కలిసి సోమవారం పర్యటించారు. వ్యాధితీవ్రత, వ్యాప్తి, తీసుకోవల్సిన జాగ్రత్తలపై స్థానిక వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించి వారి రక్తనమూనాలు సేకరించి సమీపంలోని జిల్లా ఆస్పత్రికి పంపించి పరీక్షలు చేయించాలన్నారు. డాక్టర్ మౌనిక, హెచ్ఈవో శ్రీనివాస్, హెచ్‌వి పుష్పలీల, పీడీఎంఓలు ఉన్నారు.

పాలన పరుగులు..

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన చేస్తారు. అనంతరం స్వయం సహాయక గ్రూపులకు రూ.120 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించనున్నారు.

కేసముద్రం మునిసిపల్ కేంద్రంలో ఇలా..

మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని కేసముద్రం మునిసిపాలిటీ పరిధి పూలే సెంటర్ సమీపంలో మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు హాజరుకానున్నారు. రూ.300కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అందుకోసం సుమారు 40 శిలాఫలకాలు ఒకేచోట ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా సభకు ఆటకం కలుగకుండా వారం రోజులుగా సుమారు రూ.40లక్షల వ్యయంతో నాలుగు జర్మన్ హాంగర్ టెంట్లు వేశారు.